# నాడు గ్రామ స్వరాజ్యం.. నేడు దారిద్ర్యం

- నాడు గ్రామ పంచాయతీలకు వరుసకట్టిన అవార్డులు
- దేశవ్యాప్తంగా 44 గ్రామాలకు అవార్డులు వస్తే ఇందులో 13 అవార్డులు తెలంగాణ రాష్ట్రానికే..
- 3% జనాభా ఉన్న తెలంగాణకు 30%అవార్డులు
- అత్యధిక అవార్డులతో దేశంలోనే నంబర్‌వన్ స్థానం
- నేడు గ్రామాల్లో కనీస వసతులు కల్పించలేని దుస్థితి

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ హయాంలో పల్లె ప్రగతి పరుగులు పెట్టింది. ప్రతి గ్రామం మెరిసింది. జాతీయ పంచాయతీరాజ్ పురస్కారాల్లో మన గ్రామాలకు అవార్డుల పంట పండింది. కేంద్ర సర్కారు 46 అవార్డులు ప్రకటిస్తే.. ఇందులో 13అవార్డులు తెలంగాణ రాష్ట్రానికే దక్కాయి. దేశ జనాభాలో మూడు శాతం ఉన్న తెలంగాణకు 30శాతం అవార్డులను సాధించింది. మరో ఏడాది ఏకంగా 19 పురస్కారాలు గెలుచుకున్నది. అత్యధిక అవార్డులతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2014నుంచి 2024 వరకు అంటే పదేండ్లలో తెలంగాణ పల్లెలు మొత్తం 69 అవార్డులు సాధించాయి. జిల్లా పరిషత్‌లు 8, మండల పరిషత్‌లు 17జాతీయ అవార్డులు కైవసం చేసుకున్నాయి. మొత్తం 94 పురస్కారాలు దక్కించుకున్నాయి. ఇదంతా గతం. కేసీఆర్ హయాంలో మెరిసి.. మురిసిన పల్లెలు నేడు వెలవెలబోతున్నాయి. కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో కనీస వసతులు కల్పించలేని పరిస్థితి దాపురించింది.

### మాల్ పంచాయతీకి జాతీయ ఉత్తమ అవార్డు




రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కాగా గురువారం బీహార్‌లోని మధుబనిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పంచాయతీ కార్యదర్శి రాజు ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆత్మ నిర్భర్ భారత్ పంచాయతీ ప్రత్యేక విభాగంలో మాల్ జాతీయ ఉత్తమ అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. - యాచారం

జాతీయ పంచాయతీ అవార్డు ఒక్కటీ సాధించడం గగనంగా మారింది. అంటే.. పల్లెల్లో పరిస్థితి ఎంత దారుణంగా మారిందో దీనిని చూస్తే అర్థమవుతున్నది.

### డబుల్ ఇంజిన్ సర్కారును దాటి అవార్డుల పంట

కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ స్వశక్తి కరణ్ (డీడీయూపీఎస్‌వీపీ) 2021-22 జాతీయ పంచాయతీ అవార్డులను ప్రకటించింది. మొత్తం తొమ్మిది అంశాల ఆధారంగా నాలుగు క్యాటగిరీల్లో అవార్డులు ప్రకటించగా అత్యధికంగా తెలంగాణలోని గ్రామాలకే వచ్చాయి. మొదటి, రెండోస్థానంలోనే రాష్ట్ర పంచాయతీలు నిలిచాయి. డబుల్ ఇంజిన్ సర్కారుగా చెప్పుకునే బీజేపీ పాలిత రాష్ట్రాలను తలదన్నేరీతిలో అవార్డుల్లో తెలంగాణ టాప్‌లో నిలిచింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో ఐదు అవార్డులు, ఆ తర్వాత వరుసగా 8 అవార్డుల చొప్పున తెలంగాణ తన ఖాతాలో వేసుకున్నది. 2018-19లో 10 అవార్డులు, ఆ తర్వాత 12 అవార్డులు, 2020-21 సంవత్సరంలో అవార్డుల్లో కొత్త చరిత్ర సృష్టించింది. ఏకంగా19 అవార్డులు సాధించింది. 2021-22లో 13 అవార్డులు సాధించింది. ఎక్కువ అవార్డులు దక్కుతున్నాయని తెలంగాణకు ప్రాధాన్యం తగ్గించడం, తొమ్మిది అంశాలను పరిగణనలోకి తీసుకోకపోవడం, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు అవార్డులు నిలిపివేయడం మూలంగా 2022-23లో ఒక్కటే అవార్డు దక్కింది. ఆ తర్వాతి సంవత్సరంలో రెండు క్యాటగిరీల్లో రెండు ప్రతిపాదనలు పంపగా, ఒక్క అవార్డు చిక్కింది.

### ఒకటి కాదు.. రెండు కాదు.. 8 అంశాల్లో

ఒకటి కాదు.. రెండు.. ఎనిమిది అంశాల్లో మన పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించాయి. అవార్డు పంట పండించాయి. ఆరోగ్యవంతమైన పంచాయతీ, నీటి సమృద్ధి ఉన్న పంచాయతీ, సామాజిక భద్రత ఉన్న పంచాయతీ, మహిళల సన్నిహిత పంచాయతీ, పేదరిక నిర్మూలన, జీవనోపాధి పెంచిన పంచాయతీ, సుపరిపాలన, క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ.. ఇలా ఎనిమిది అంశాల్లో తెలంగాణ గ్రామాల్లో అవార్డులు జాతీయ అవార్డులు సాధించాయి. అనేక పల్లెలు సర్వతోముఖాభివృద్ధి సాధించాయి. మరోవైపు దేశంలో వందశాతం బహిరంగ మల మూత్ర విసర్జనరహిత (ఓడీఎఫ్) ప్లస్ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది. గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్‌లోనూ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది.

### అవార్డుల పంట ఎలా పండిందంటే..

కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేసిన పల్లె ప్రగతి మూలంగానే జాతీయ అవార్డుల పంట పండింది. ప్రతి గ్రామానికి ట్రాక్టర్, వైకుంఠధామం, పల్లె ప్రకృతివనం, నర్సరీ, డంపింగ్ షెడ్ ఏర్పాటుతోపాటు పంచాయతీ కార్యదర్శిని నియమించారు. కేంద్రంతో సమానంగా నిధులను విడుదల చేశారు. ప్రతిగ్రామంలో ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ద్వారా రక్షిత తాగునీరు అందించారు. నూతన పంచాయతీ చట్టాన్ని తీసుకొచ్చి మొక్కల పెంపకానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. నాటిన మొక్కల్లో 85శాతం మొక్కలు బతకాల్సిందేనని చట్టంలో పొందుపర్చారు. దీంతో ప్రతిపల్లె నందనవనంగా మారింది. తెలంగాణలోని గ్రామాలు, పట్టణాలు అన్ని కూడా అభివృద్ధి బాట పట్టాయి. జాతీయ అవార్డులే ఇందుకు నిదర్శనం.

### సంవత్సరాలవారీగా పదేండ్లలో జాతీయ పంచాయతీ అవార్డుల వివరాలు (2015 నుంచి 2025 వరకు) మొత్తం అవార్డులు

| సంవత్సరం | జెడ్పీలు | మండలాలు | గ్రామాలు | మొత్తం |
|---|---|---|---|---|
| 2015 మదింపు సంవత్సరం 2013-14 | - | - | 5 | 5 |
| 2016 మదింపు సంవత్సరం 2014-15 | 1 | 2 | 5 | 8 |
| 2017 మదింపు సంవత్సరం 2015-16 | 1 | 2 | 5 | 8 |
| 2018 మదింపు సంవత్సరం 2016-17 | 1 | 2 | 5 | 8 |
| 2019 మదింపు సంవత్సరం 2017-18 | 1 | 2 | 6 | 9 |
| 2020 మదింపు సంవత్సరం 2018-19 | 1 | 2 | 7 | 10 |
| 2021 మదింపు సంవత్సరం 2019-20 | 1 | 2 | 9 | 12 |
| 2022 మదింపు సంవత్సరం 2020-21 | 1 | 4 | 14 | 19 |
| కొత్త విధానం | | | | |
| 2023 మదింపు సంవత్సరం 2021-22 | 1 | 1 | 11 | 13 |
| 2024 మదింపు సంవత్సరం 2022-23 | - | - | 1 | 1 |
| 2025 మదింపు సంవత్సరం 2023-24 | - | - | 1 | 1 |
| మొత్తం అవార్డులు | 8 | 17 | 69 | 94 |

### కాంగ్రెస్ పాలనలో పడకేసిన ప్రగతి

పదేండ్ల కేసీఆర్ పాలనలో ప్రతి పల్లె సింగిడి సకల సౌకర్యాలతో వర్ధిల్లితే.. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నది. స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహించకపోవడంతో పట్టించుకునే నాథుడు లేక గ్రామాలు అనాథల్లా మారాయి. కేంద్రం నుంచి, 15వ ప్రణాళికా సంఘం నుంచి కూడా నిధుల విడుదల నిలిచిపోయింది. పంచాయతీ కార్మికులకు సకాలంలో జీతాలు అందడం లేదు. ఇప్పటికే మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు కూడా కార్యదర్శి చేతిలో చిల్లిగవ్వ ఉండటం లేదు. మురుగు కాల్వలు పొంగిపొర్లుతున్నాయి. నీళ్లు పోసే దిక్కు లేక కేసీఆర్ హయాంలో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. అనేక చోట్ల తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రోడ్డు ఎక్కుతున్న మహిళల ఫొటోలు మళ్లీ మీడియాలో కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పాలనలో ఇలాంటి దారుణ పరిస్థితులు ఉన్నందున ఇక రాష్ట్రానికి కేంద్ర అవార్డులు రావడం కష్టతరంగా మారనున్నది.

# నాడు మురిసిన పల్లెలు.. నేడు కన్నీరు

- కేసీఆర్ పదేండ్ల పాలనలో గ్రామాల్లో స్వర్ణయుగం
- ప్రతి ఊరు మెరుగైన జీవనానికి కేరాఫ్‌గా మారింది
- దేశంలో మూడు శాతం జనాభా ఉన్న తెలంగాణ పల్లె ప్రగతిలో 30 శాతం అవార్డులు గెలుచుకున్నది
- కాంగ్రెస్ పాలనలో గ్రామస్వరాజ్యం గాడితప్పింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్ల పాలన.. గ్రామస్వరాజ్యంలో స్వర్ణయుగమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభివర్ణించారు. దేశంలో 3శాతం జనాభా ఉన్న తెలంగాణ, పల్లె ప్రగతిలో 30శాతం అవార్డులను గెలుచుకోవడం పల్లె ప్రగతిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి విజయమని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో పదేండ్లపాటు మురిసిన పల్లెలు.. కాంగ్రెస్ పాలనలో నేడు మళ్లీ కన్నీరు పెడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పాలనలో గ్రామస్వరాజ్యం పూర్తిగా గాడితప్పిందని గురువారం ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. పదేండ్ల పాలనలో ఉద్యమ నినాదాలను నిజం చేయడమే కాకుండా గ్రామ స్వరాజ్యం కోసం జాతిపిత మహాత్ముడు కన్న కలలను కూడా కేసీఆర్ సాకారం చేశారని గుర్తుచేశారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకొంటున్న వేళ.. పల్లెసీమలే దేశానికి పట్టుగొమ్మలన్న మహాత్మాగాంధీ ఆశయాలే స్ఫూర్తిగా బీఆర్ఎస్ పాలనలో ప్రాణంపోసిన 'పల్లెప్రగతి'ని గుర్తుచేసుకోవాల్సిన సందర్భమిదని పేర్కొన్నారు.



> సమైక్యపాలనలో దశాబ్దాలపాటు దగాపడ్డ పల్లెలను.. దర్జాగా కాలర్ ఎగరేసుకునే స్థాయికి కేసీఆర్ తీసుకొచ్చారు. సమస్యల సుడిగుండంలో విలవిలలాడిన ప్రతి పల్లె.. పదేండ్ల పాలనలో సకల సౌకర్యాల హరివిల్లుగా మారింది. కేసీఆర్ సంకల్పంతో ప్రతి పల్లెసీమ ప్రగతిసీమగా మారింది. దేశంలోనే ఆదర్శ గ్రామాలకు చిరునామాగా నిలిచిన తెలంగాణ పల్లెలు ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో అధ్వాన పరిస్థితులకు అడ్రస్‌గా మారడం అత్యంత బాధాకరం.
> - కేటీఆర్

### నాడు పల్లెలు సకల సౌకర్యాల హరివిల్లులు

'కేసీఆర్ సంకల్పంతో ప్రతి పల్లెసీమ ప్రగతిసీమగా మారింది. ప్రతి పల్లెలో డంప్ యార్డు తప్పు.. చెత్త కంపు లేకుండా పోయింది. కూలిపోయే స్థితిలో ఉన్న ఖాళీ ఇండ్ల కిరికిరి నుంచి పొంగిపొర్లే మురికికాలువల శుభ్రత వరకూ ప్రతి సమస్యకు పదేండ్ల పాలనలో శాశ్వత పరిష్కారం లభించింది. కలుషిత నీటి కలకలం లేకుండా, సీజనల్ రోగాల చింతలేకుండా సాగిన పంచాయతీల ప్రస్థానం ఒక స్వర్ణయుగం! పచ్చదనానికి కొదువలేకుండా, నిధులకు కొరతలేకుండా, విధులకు ఆటంకం లేకుండా, ప్రతి ఊరును మెరుగైన జీవనానికి మారుపేరుగా మార్చింది మన కేసీఆర్ విజన్!' అని కేటీఆర్ కొనియాడారు.

### నేడు గ్రామాల్లో కనీస వసతుల్లేవ్

'కాంగ్రెస్ పాలనలో గ్రామస్వరాజ్యం పూర్తిగా గాడితప్పింది. ఏడాదిన్నర గడిచినా స్థానిక సంస్థలకు ఎన్నికల్లేవు. 15వ ఆర్థిక సంఘం నిధులు లేవు. గ్రామాల్లో కనీస వసతులు లేవు. పల్లెప్రజలకు గుక్కెడు మంచి నీళ్లు దిక్కులేవు. చివరికి పంచాయతీ సిబ్బందికి వేతనాల్లేవు. ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు లేవు. మాజీ సర్పంచ్‌ల బిల్లులకు మోక్షం లేదు. ఢిల్లీ పార్టీలను నమ్మిన పాపానికి పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిన తీరును తెలంగాణ పల్లె ప్రజలు గమనిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉండి తీవ్ర అన్యాయం చేస్తున్న బీజేపీకి, పచ్చని పల్లెలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు కర్రుగాల్చి వాతపెడ్తరు' అని కేటీఆర్ హెచ్చరించారు.

# రచ్చకెక్కిన 'డబుల్ బెడ్రూం' లొల్లి!

- చిన్నగూడూరులో తాళాలు పగులగొట్టి ఇండ్లలోకి చేరిన డబుల్‌బెడ్రూం లబ్ధిదారులు
- ఖాళీ చేయించేందుకు రెవెన్యూ అధికారుల యత్నం
- వివరాలు సేకరించిన పోలీసులు


చిన్నగూడూరులో తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగుతున్న గ్రామస్థులు

చిన్నగూడూరు, ఏప్రిల్ 24 : డబుల్‌బెడ్‌రూం ఇండ్లలొల్లి మరోసారి రచ్చకెక్కిన ఉదంతం మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చిన్నగూడూరు మండల కేంద్రంలో 75 డబుల్‌బెడ్‌రూం ఇండ్లు రెండేండ్ల క్రితం నిర్మించారు. ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారులను ఎంపికచేయలేదు. అనంతరం ప్రభుత్వం మారడంతో లబ్ధిదారుల ఎంపికలో జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో గ్రామంలోని పేదలు గురువారం డబుల్ బెడ్‌రూం ఇండ్ల తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లారు. తహసీల్దార్ మహబూబ్‌అలీ పోలీసులతో వచ్చి లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులను ఎంపిక చేసిన అనంతరం ఇండ్లను కేటాయిస్తామని, తక్షణమే ఇండ్లు ఖాళీ చేయాలని కోరగా వారు వినలేదు. తమను ఖాళీ చేయిస్తే ఇక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. ఆందోళనకు కారణమైన గంగాధరి అనిల్‌ను స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ కృష్ణకిశోర్ మాట్లాడుతూ.. ఆధారాలు చూపితే రెవెన్యూ అధికారులు వారికే ఇండ్లు కేటాయిస్తారని తెలిపారు. ఇండ్లలోకి అక్రమంగా చొరబడినట్టు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సిరిసిల్లలోని జిల్లా కలెక్టరేట్ వద్ద కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న వీర్నపల్లి మండలం వన్‌పల్లి రైతులు

# మండుటెండలో అన్నదాతల ఆందోళన

- ధాన్యం కొనుగోళ్ల లో నిర్లక్ష్యంపై మండిపాటు
- సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట వన్‌పల్లి రైతుల ధర్నా
- గంభీరావుపేట, చందుర్తి మండలాల్లోనూ రాస్తారోకోలు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): యాసంగి ధాన్యం కొనుగోళ్ల విషయంలో సర్కారు నిర్లక్ష్యంపై సిరిసిల్ల జిల్లా రైతులు కన్నెర్రజేశారు. అట్టహాసంగా కేంద్రాలు ప్రారంభించినా.. కాంటా పెట్టకపోవడంతో ఓపిక నశించి వీర్నపల్లి, గంభీరావుపేట, చందుర్తి మండలాల రైతులు మండుటెండలో గురువారం రోడ్డెక్కారు. వీర్నపల్లి మండలం వన్‌పల్లికి చెందిన వంద మంది రైతులు సిరిసిల్ల కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అధికారులకు తమ గోడు వెళ్లబోసుకుంటామని కోరితే పోలీసులు లోనికి అనుమతించకుండా గేట్లు మూసివేశారు. ఆగ్రహించిన రైతులు నిప్పుల కొలిమిలా ఉన్న ఎండను సైతం లెక్కచేయకుండా కరీంనగర్ - సిరిసిల్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు జోక్యం చేసుకుని అధికారుల వద్దకు తీసుకెళ్తామని నచ్చజెప్పి రోడ్డుపై కూర్చున్న రైతులను బలవంతంగా లేపారు. అక్కడి నుంచి కలెక్టరేట్ గేట్ ముందు బైఠాయించారు. పోలీసులు నచ్చజెప్పినా రైతులు వినకపోవడంతో ఐదుగురు రైతులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వద్దకు తీసుకెళ్లారు. ధాన్యం కొనుగోళ్లు చేసి లారీలను పంపిస్తామని కలెక్టర్ ఇచ్చిన హామీతో ఆందోళన విరమించారు.

### ముస్తఫానగర్‌లో రాస్తారోకో..

గంభీరావుపేట మండలం ముస్తఫానగర్‌లో ధాన్యం కొంటలేరంటూ రైతులు ప్రధాన రోడ్డుపై ఆందోళనకు దిగారు. తహసీల్దార్ మారుతిరెడ్డి రైతులకు ఫోన్ చేసి వెంటనే కొనుగోలు చేసి ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. చందుర్తి మండల కేంద్రంలోని వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి, తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు.


కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని పొట్టపెల్లి(కే)లో ధర్నా చేస్తున్న రైతులు

# కొనుగోలు కేంద్రం కోసం రోడ్డెక్కిన రైతులు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 24: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం పొట్టపెల్లి(కే) గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. గురువారం లక్ష్మణచాంద-కనకాపూర్ ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. పంట కోత దశకు వచ్చినా అధికారులు, ప్రజాప్రతినిధులు కేంద్రాన్ని ప్రారంభించకపోవడాన్ని నిరసిస్తూ దాదాపు 100 మందికిపైగా రైతులు బైఠాయించారు. కేసీఆర్ హయాంలో పొట్టపెల్లి(కే)లోనే కేంద్రాన్ని ప్రారంభించారని, కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని ఎత్తివేసిందని మండిపడ్డారు. ధాన్యాన్ని అమ్ముకోవడానికి రాచాపూర్ లేదా లక్ష్మణచాంద గ్రామానికి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్సై మాలిక్ రెహమాన్ అక్కడికి చేరుకుని తహసీల్దార్ జానకీకి పరిస్థితి వివరించారు. 24 గంటల్లో కేంద్రాన్ని మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# 50 వేలిస్తేనే ఇందిరమ్మ ఇల్లు!

మొదటిపేజీ తరువాయి...

ఇండ్ల కోసం కాంగ్రెస్ నాయకులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ గుర్రంగూడెం వాసులు గురువారం గ్రామంలోని బొడ్రాయి సెంటర్ వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ.. తమ ఊరిలో 79 మందితో ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితా తయారుచేశారని, వారిలో 18 మందికి ఇండ్లు మంజూరైనట్టు జాబితాను ప్రదర్శించినట్టు తెలిపారు. వీరిలో అనర్హులే అత్యధికంగా ఉన్నట్టు వారు పేర్కొన్నారు. రూ.50 వేలు ఇస్తేనే ఇందిరమ్మ ఇల్లు వస్తుందంటూ కాంగ్రెస్ నాయకులు గోవిందరెడ్డి, శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేస్తున్నారని తెలిపారు. పేదలకు దక్కాల్సిన ఇండ్లను డబ్బులున్న వారికే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు రాకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనకు దిగిన తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని వారితో చర్చించి రాస్తారోకో విరమింపజేశారు.


ఇండ్ల కోసం బొడ్రాయిసెంటర్ వద్ద రాస్తారోకో చేస్తున్న గుర్రంగూడెం గ్రామస్థులు

### ప్రత్యేకాధికారి ఎదుటే నేతల వాగ్వాదం

ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హులకు చోటుదక్కలేదనే విషయమై ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు గుర్రంగూడెంలో గురువారం విచారణ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి విచారణ జరిపారు. అనర్హులకు ఇస్తున్నారని, డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వారు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు ప్రత్యేకాధికారి ఎదుటే గ్రామస్థులతో అధికార పార్టీ నాయకులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. అక్కడ స్వల్ప ఉద్రిక్త వాతావరణ నెలకొనడంతో సదరు అధికారి వెనుదిరిగి వెళ్లిపోయారు.

### గొడవ సద్దుమణిగాక జాబితా పరిశీలిస్తాం



ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాను పరిశీలిస్తూ విచారణ చేస్తున్న సమయంలో గుర్రంగూడెంలో గొడవలు జరిగాయి. దీంతో విచారణ నిలిపివేశాం. గ్రామంలో గొడవలు సద్దుమణిగిన తరువాత అర్హుల జాబితా పరిశీలిస్తాం. డబ్బుల వసూలపై నాకు లిఖితపూర్వక ఫిర్యాదులు అందలేదు. ఫిర్యాదు వస్తే విచారణ చేస్తాం.

-శ్రీనివాసరావు, గ్రామ ప్రత్యేకాధికారి

### 50 వేలిస్తేనే ఇల్లు వస్తదన్నారు



ఇందిరమ్మ ఇంటి కోసం రూ.50 వేలు ఇవ్వాలంటూ కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. నా దగ్గరలేవని చెప్పాను. దీంతో వారు నాకు ఇల్లు రాకుండా చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇండ్లను అమ్ముకుంటున్నారు. పేదలకు ఇస్తామన్న ఇండ్లను డబ్బులిచ్చినోళ్లకు అమ్ముకుంటున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

-ముత్తినేని లక్ష్మి, గుర్రంగూడెం

### డబ్బులివ్వలేదని రానివ్వలేదు



ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేసేటప్పుడు అర్హుల జాబితాలో నా పేరు ఉంది. కానీ ఫైనల్ జాబితాలో నాపేరు లేకుండా చేశారు. పెద్ద పెద్దవాళ్లే ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేర్లను రాసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, గోవిందరెడ్డి డబ్బులు అడిగితే నేను ఇవ్వలేదు. అందుకే నాకు ఇల్లు రాకుండా చేశారు. నాకు ఇల్లు వచ్చేలా చేయండి సార్.

-పద్దం సుశీల, గుర్రంగూడెం

### 60 వేలు అడిగారు




మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించేందుకు మా ఊర్లోని పెద్ద నాయకుడు వెంకటేశ్వర్లు రూ.60 వేలు లంచం అడిగాడు. ఇవ్వలేదని మాకు ఇల్లు రాకుండా చేశాడు. గ్రామంలో పేదలకు ఇండ్లు రాకుండా కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారు. అధికారులు ఇండ్లు ఎలా మంజూరు చేస్తున్నారో అర్థం కావడం లేదు.

-చీమల కవిత, గుర్రంగూడెం

# తరుగు దోపిడీని అరికట్టాలని రాస్తారోకో


- కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్‌లో రైతుల ఆందోళన

ఎల్లారెడ్డి రూరల్ (నాగిరెడ్డిపేట్), ఏప్రిల్ 24: తరుగు పేరిట రైస్‌మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ రైతులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం చీనూర్ గ్రామానికి చెందిన రైతులు.. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయించారు. కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. రైసుమిల్లు యజమానులు క్వింటాల్‌కు 7 నుంచి 11కిలోల మేర తరుగు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.


నాగిరెడ్డిపేట్‌లోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న చీనూర్ గ్రామ రైతులు

# కాంగ్రెసోళ్ల వేధింపులు భరించలేక వెళ్లిపోయా!

- అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని దౌర్జన్యం చేసిండ్రు
- బానిసలా ఉండాలె.. చెప్పినట్టు చేయాలని ఒత్తిడి పెంచారు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది
- బద్దెనపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రియాంక ఆవేదన


విలేకరులతో మాట్లాడుతున్న బద్దెనపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రియాంక

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 24: 'మేం చెప్పినట్టే చేయాలె.. మాకు బానిసలా ఉండాలె అన్నంతగా కాంగ్రెస్ నేతలు చేసిన వేధింపులను భరించలేకనే నేను రాజీనామా పత్రాలను డీపీవో, ఎంపీడీవోకు వాట్సాప్‌లో పంపి వెళ్లిపోయిన' అని రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి పంచాయతీ కార్యదర్శి మంత్రి ప్రియాంక ఆవేదన వ్యక్తం చేసింది. ఈనెల 21న ఆమె అదృశ్యమైనట్టు వార్తలు రాగా తిరుపతి ప్రాంతంలో ఆచూకీ లభించింది. తండ్రి రాజేశం, కుటుంబసభ్యులతో కలిసి బుధవారం రాత్రి క్షేమంగా ఇంటికి చేరింది. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితేను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నది. తాను పడిన ఇబ్బందులను వివరించింది. అనంతరం సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో తనను వేధించిన కోదాది మల్లేశ్, గుగ్గిల్ల శ్రీకాంత్, అభినయ్, కొమిరె రాజుపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడింది. 'నేను బద్దెనపల్లి పంచాయతీ కార్యదర్శిగా 20నెలల నుంచి పనిచేస్తున్న. గ్రామంలో కోదాది మల్లేశ్, గుగ్గిల్ల శ్రీకాంత్, అభిగౌడ్, కొమిరె రాజు తాము చెప్పినట్టే నేను వినాలనేవారు. ప్రతి సమావేశానికి ముందు వారికి ఫోన్ చేసి చెప్పాలనేవారు. రేపు సర్పంచ్ అయ్యేది మేమే.. ఏమున్నా మాకు చెప్పాలె.. మాకు అనుకూలంగా పనిచెయ్యాలని.. ఆఖరికి నేను వెళ్లిపోయే రోజు కూడా వేధించారు. ఏడాది నుంచి ఎంతో వేదన భరించిన. పైఅధికారులకు ఏడాది నుంచి చెప్పుకుంటూ వస్తున్నా వారు మద్దతివ్వలేదు. మూడుసార్లు కలెక్టర్‌ను కలిసిన. అయినా ఫలితం లేకపోయింది. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలోని సభ్యులు అనర్హులకు ఇండ్లు మంజూరు చేయాలని ఒత్తిడి చేశారు. ఒత్తిడి భరించలేక ఇల్లు విడిచి వెళ్దామని నిర్ణయించుకుని తిరుపతికి వెళ్లిపోయా. మా వాళ్లు ట్రేస్ చేసి తీసుకొచ్చారు. భవిష్యత్‌ను కుటుంబసభ్యులతో చర్చించి నిర్ణయించుకుంటానని ప్రియాంక వివరించింది.


సుద్దాలలో పంచాయతీ సెక్రటరీని నిలదీస్తున్న గ్రామస్థులు

# ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక జాబితాపై నిలదీత

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 24 : ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ గ్రామ పంచాయతీ కార్యదర్శిని నిలదీసిన ఘటన మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం సుద్దాలలో గురువారం చోటుచేసుకున్నది. సుద్దాలలో పంచాయతీ కార్యదర్శి కళ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు ఎంపికచేసిన జాబితా వివరాలను వెల్లడించారు. 615 మంది దరఖాస్తు చేసుకోగా 412 మందిని ఎంపిక చేసి ఆన్‌లైన్ చేశారు. ఇందులో ఇందిరమ్మ కమిటీ సభ్యులు 42 మంది లబ్ధిదారులను ఎంపికచేసినట్టు సెక్రటరీ తెలుపగా, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులను పక్కనపెట్టి ఇండ్లు ఉన్న వారిని ఎలా ఎంపిక చేస్తారని మండిపడ్డారు. సుద్దాలలో దాదాపు 300 నిరుపేద కుటుంబాలుంటాయని, కేవలం 42 మందిని ఎలా ఎంపిక చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయమై ఎంపీవో అజ్మత్ అలీని వివరణ కోరగా... ఇందిరమ్మ కమిటీ సభ్యుల సూచన మేరకే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఎంపికలు జరిగాయని తెలిపారు.